# మా మద్దతు బీఆర్‌ఎస్‌కే.. ప్రచారంలో పాల్గొంటాం..



నియోజకవర్గం టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం..
- ఆత్మీయ సమ్మేళనంలో టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ప్రతినిధులు
- మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు హామీ

గోల్నాక, నవంబర్ 1 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేగా కాలేరు వెంకటేశ్ చేపడుతున్న అంబర్‌పేట అభివృద్ధిని చూసి వచ్చే శాసన సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు అంబర్‌పేట నియోజకవర్గం టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని వారు ప్రకటించారు. బుధవారం అంబర్‌పేట ఎస్‌ఆర్‌జీ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గంలో టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అసోసియేషన్ ప్రతినిధులు గౌతం, అక్బర్, సాగర్ రెడ్డి, జాఖీర్, ఖాజ, రాజు, అంజనేయులు, నరేశ్, నవీన్, వెంకట్‌నాయుడు, పి.శ్రీను, రవికాంత్, కృష్ణ, ఇస్మాయిల్, అశోక్‌కుమార్, జగన్ గౌడ్, డి.రాజు, ముక్తార్, ఫెరోజ్, రవి, ఆంజనేయులు, కాలేరు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

### కాలేరుకు మద్దతుగా ప్రచారం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా బుధవారం అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ న్యూఅన్నపూర్ణనగర్ బస్తీ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కాలేరును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### కాలేరుకు జన నీరాజనం

అంబర్‌పేట, నవంబర్1 : అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు అడుగడుగునా జనం నీరాజనం పడుతున్నారు. ఎక్కడకు వెళ్లినా పూలవర్షం కురిపిస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బయటకు వచ్చి హారతులు పడుతున్నారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని కుమ్మరివాడి, భరత్‌నగర్, గజానంద్‌గడ్డ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

### ఎమ్మెల్యే కాలేరు అంబర్‌పేటను అభివృద్ధి చేశాడు

కాచిగూడ, నవంబర్ 1 : పదిహేను ఏండ్లలో లేని అంబర్‌పేట అభివృద్ధి.. కేవలం నలుగున్నర ఏండ్లలోనే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్ని రంగాలను అభివృద్ధి చేశాడని గోల్నాక డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు భరత్‌రాజ్ ముదిరాజ్ అన్నారు. అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా డివిజన్‌లోని నెహ్రూనగర్, సుందర్‌నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేసి అంబర్‌పేటలో గులాబీ జెండాను ఎగురవేసి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు పథకాలను గడప గడపకు విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలేరు రామకృష్ణ, ఎర్రబోలు నర్సింహా రెడ్డి, శ్రీరాములు, రాజన్, అంబటి రవి, నర్సింగ్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బాగ్‌అంబర్‌పేట డివిజన్ కుమ్మరివాడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న భరత్, రామకృష్ణ, నర్సింహారెడ్డి తదితరులు

## ఆవు పేడతో దీపావళి ప్రమిదలు



ఆవుపేడ ప్రమిదలను చూపిస్తున్న గోశాల గౌరవ అధ్యక్షుడు మహేశ్

కాచిగూడ, నవంబర్ 1 : దీపావళి పండుగను పురస్కరించుకుని ఆవుపేడతో తయారు చేసిన లక్ష ప్రమిదలను భక్తులకు అందుబాటులో ఉంచినట్లు తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. బుధవారం కాచిగూడ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ కోసం ప్రజలు ప్రమిదలనే ఉపయోగించాలని సూచించారు. ఆవుపేడలో లక్ష్మీమాత నివసిస్తుందని, ఇతర ప్రమిదలకంటే ఆవుపేడ ప్రమిదలు ఎంతో శ్రేష్ఠకరమైనవని, ఈ ఆవుపేడ ప్రమిదల బూడిదను వాడితే నీటి ఆక్సిజన్ లెవల్ పెరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు గోశాలలకు చెందిన 1500 మంది మహిళలతో ఆవుపేడ ప్రమిదలను తయారు చేపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం రోజా పాల్గొన్నారు. వివరాలకు 93921 73367లో సంప్రదించాలని కోరారు.

## ఫుట్‌పాత్‌పై పెయింటర్ మృతి

కాచిగూడ, నవంబర్ 1 : తాగుడుకు బానిసైన పెయింటర్ మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై జి.మోతిలాల్ తెలిపిన వివరాల ప్రకారం లింగంపల్లి ప్రాంతానికి చెందిన కన్నయ్య కుమారుడు ఎం.కృష్ణ(54)వృత్తిరీత్యా పెయింటర్. గత కొంత కాలంగా కృష్ణ మద్యానికి బానిసయ్యాడు. పీకల వరకు మద్యం సేవించి లింగంపల్లి సమీపంలో ఉన్న ఫుట్‌పాత్‌పై మంగళవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## 80 ఏండ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు 12డి ఫారం

అంబర్‌పేట, నవంబర్ 1: ఓటు వేయలేని పరిస్థితిలో ఉన్న 80 ఏండ్లు దాటిన సీనియర్ సిటిజన్స్‌కు ఎన్నికల సంఘం 12డి ఫారాలను అందజేస్తున్నది. ఈ ఫారం నింపి ఇస్తే రిటర్నింగ్ అధికారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అంబర్‌పేట నియోజకవర్గంలో ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఎంత మంది 80 ఏండ్లు దాటిన సీనియర్ సిటిజన్స్ ఉన్నారో అధికారులు గుర్తిస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్కరు, ఐదుగురు, పది మంది ఇలా ఉన్నారు. వారందరికి డీసీ మారుతీప్రసాద్ బుధవారం 12డి ఫారాలను అందజేశారు. ఈ ఫారం నింపి ఇస్తే దాన్ని తీసుకొని వెళ్లి రిటర్నింగ్ అధికారికి సమర్పించిన తరువాత ఆర్‌ఓ పరిశీలించి వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఈ నెల 2వ తేదీలోపు 80 ఏండ్లు పైబడిన వారి నుంచి 12డి ఫారాలను సేకరిస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చేనాటికి ఫారం సమర్పించాల్సి ఉంటుంది. అందుకే డీసీ నేతృత్వంలో సిబ్బంది 12డి ఫారాలను సేకరించారు. అలాగే ప్రతి ఇంటికి ఫ్రౌడ్ టూ బీ ఏ ఓటర్ స్టిక్కర్‌ను అతికించారా? లేదా? అనేది కూడా డీసీ పరిశీలన చేశారు. కొన్నిచోట్ల ఈ స్టిక్కర్లను అతికించలేదని ఫిర్యాదులు రావడంతో డీసీ ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ స్టిక్కర్లు అతికించి ఉన్నాయని ఆయన తెలిపారు.



వృద్ధులకు 12డీ ఫారం అందజేస్తున్న సర్కిల్ డీసీ, ఏఆర్వో మారుతీప్రసాద్

## ఫీవర్ దవాఖానను సందర్శించిన డీఎంహెచ్‌ఓ



చికిత్స పొందుతున్న చిన్నారిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డా.పుట్ల శ్రీనివాస్‌రావు

అంబర్‌పేట, నవంబర్ 1: ఖైరతాబాద్ డీఎంహెచ్‌ఓ డా.పుట్ల శ్రీనివాసరావు బుధవారం నల్లకుంటలోని ఫీవర్ దవాఖానను సందర్శించారు. ఇటీవల ప్రభుత్వం హైదరాబాద్ జిల్లా పరిధిలో ఆరు డీఎంహెచ్‌ఓలను ఏర్పాటు చేసింది. ఫీవర్ దవాఖాన ఖైరతాబాద్ డీఎంహెచ్‌ఓ పరిధిలోకి వస్తున్నది. దీంతో డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన డా.పుట్ల శ్రీనివాస్‌రావు ఫీవర్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఓపీ దగ్గరకు వెళ్లి రోగులకు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఓ చిన్నారిని కూడా స్వయంగా పరిశీలించారు. అప్పుడే వార్డులో రోగులకు ఇచ్చేందుకు తీసుకువచ్చిన మెనూను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయనతోపాటు దవాఖాన సూపరింటెండెంట్ డా.కె.శంకర్, ఆర్‌ఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఫార్మాసిస్టు జె.అశోక్ తదితరులు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ, నవంబర్ 1 : బీసీల భావితరాల కోసం కేంద్ర ప్రభుత్వం జనాభా గణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం విఫలం చెందిందని, దేశ ప్రజలు బీజేపీని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. జనగణనలో కులగణన చేయాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కాచిగూడ,నవంబర్ 1: యాదవులు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకునే సదర్ వేడుకలు ఈనెల 13,14వ తేదీల్లో నిర్వహించాలని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ చిట్టబోయిన నందకిశోర్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం యాదవ సంఘంలో ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రేటర్ మాజీ అధ్యక్షుడు పాండుయాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న సైదాబాద్, ఖైరతాబాద్, అమీర్‌పేట, కార్వాన్, లాల్ దార్వాజా, ఆసిఫ్‌నగర్, బజార్‌ఘాట్ ప్రాంతాలు... 14వ తేదీన నారాయణగూడలో సదర్ వేడుకలు కన్నులపండుగగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని అనాధిగా వస్తున్న కుల ఆచార సంప్రదాయాల పద్ధతులను యాదవులు ఐక్యమత్యంతో పాటిస్తూ ఆయా తేదీల్లో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జంగాల అనిల్‌కుమార్ యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో ఎగిరిన మన జాతీయ జెండా



పతకాలతో స్విమ్మర్ క్వీన్ విక్టోరియా

కాచిగూడ, నవంబర్ 1 : హామర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు దుబాయ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వెటరన్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 12 దేశాల 252 క్రీడాకారులు పాల్గొనగా.. తెలంగాణలోని బర్కత్‌పుర ప్రాంతానికి స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియా పాల్గొని 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్‌లో బంగారు, 100 మీటర్స్ ఫ్రీస్టైల్‌లో రజితం, 50, 100 బ్రీత్ స్ట్రోక్‌లో 2 కాంస్య పతకాలను గెలుచుకున్నది. తెలంగాణ నుంచి అంతర్జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని స్విమ్మర్‌గా క్వీన్ విక్టోరియా రికార్డు కెక్కింది. క్వీన్ విక్టోరియా బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించి, దుబాయ్‌లో జాతీయ జెండా ఎగురవేసినందుకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పలువురు ప్రముఖులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.